ప్రజాశక్తి
బుధవారం 12 ఫిబ్రవరి 2025
5
కర్నూలు

మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా

కౌలు చట్టంపై మౌనమేల..!

- చట్టం చేయడంలో సర్కార్ జాప్యం - ఎన్నికల్లో ఇచ్చిన హామీ గాలికి - నష్టపోతున్న కౌలు రైతులు

తాము అధికారంలోకి వస్తే కౌలు చట్టంలో మార్పులు చేస్తామని ఎన్నికల ముందు కూటమి సర్కార్ హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చి ఏడు నెలలు పూర్తయినా ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదు. కౌలు చట్టం చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం జాప్యం చేస్తోంది. దీంతో కౌలు రైతులు నష్టపోతున్నారు. ఈ అసెంబ్లీ సమావేశాల్లోనైనా చట్టం చేస్తారేమో అని రైతులు ఆశతో ఎదురు చూస్తున్నారు.

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

ఎన్నికల ముందు కొత్త కౌలు చట్టం చేస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఆ హామీపై మౌనం వహిస్తోంది. బడ్జెట్ సమావేశాల్లో కొత్త కౌలుచట్టం బిల్లు ప్రవేశ పెట్టి వచ్చే ఖరీఫ్ నుంచి ప్రభుత్వం అమలు చేస్తోందా అన్న చర్చ రైతుల్లో కొనసాగుతోంది. ఫిబ్రవరి చివరి వారంలో బడ్జెట్ సమావేశాలు జరిగే అవకాశం ఉండడంతో కొత్త కౌలు చట్టంపై కౌలు రైతుల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో లక్ష మంది వరకూ కౌలు రైతులు ఉన్నారు. జిల్లా వ్యవసాయ సాగులో 80 శాతం వీరే చేస్తున్నారు. అందరికీ అన్నంపెట్టే కౌలురైతులకు మాత్రం ప్రభుత్వాల న్యాయం చేయడం లేదు. సాగు చేస్తున్న కౌలు రైతులకు ప్రభుత్వ సాయం అందకుండా చేస్తున్న పరిస్థితి నెలకొంది. అందుకు కారణం కౌలుచట్టంలో ఉన్న లొసుగులే కారణమని చెప్పొచ్చు. 2011లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం 'భూ అధీకృత సాగుదారుని' చట్టం పేరుతో కౌలురైతులకు ప్రత్యేక చట్టం తెచ్చింది. ఈ చట్టం కౌలురైతులకు కొంతమేర ఉపయోగపడినా పూర్తిస్థాయిలో న్యాయం జరగని పరిస్థితి నెలకొంది. ఈ చట్టంలో భూ యజమానితో సంబంధం లేకుండా కౌలురైతులకు కౌలుకార్డులు జారీ చేసేవిధంగా నిబంధనలు తెచ్చారు. దీంతో కౌలుకార్డుల ఇవ్వకపోతే కౌలురైతులు, రైతుసంఘాల నాయకులు రెవెన్యూ అధికారులను నిలదీసేవారు. దీంతో కౌలుకార్డులు సాగుదారులకు అందేందుకు కొంత దోహదపడింది. కౌలుకార్డులు అందుకున్న రైతులకు పంటరుణాలు ఇవ్వాలంటూ బ్యాంకుల వద్ద ఆందోళన చేసి కొంతమేర సాధించుకునేవారు. కౌలురైతులకు పూర్తిస్థాయిలో న్యాయం జరిగే విధంగా కౌలుచట్టంలో మార్పులు చేయాలని కౌలురైతులు, రైతు సంఘాల నుంచి పెద్దఎత్తున డిమాండ్ ఉండేది.

వైసిపి చేసిన చట్టంతో ఉరి

2019లో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. కౌలుచట్టంలో మార్పులు చేస్తున్నట్లు చెప్పింది. దీంతో కౌలురైతులకు న్యాయం జరుగుతుందని అంతా భావించారు. వైసిపి 2019లో చేసిన 'ఆంధ్రప్రదేశ్ పంట సాగుదారుని హక్కుచట్టం' కౌలురైతులకు ఉరితాడుగా మారింది. భూయజమాని అంగీకారంతోనే కౌలురైతులకు కౌలుకార్డులు ఇవ్వాలంటూ కొత్తచట్టంలో మార్పులు చేసింది. దీంతో కౌలురైతులకు కౌలుకార్డులు అందని ద్రాక్షగా మారాయి. దీంతో అధికారులు కౌలురైతుల సంఖ్యను తక్కువగా చూపిస్తూ ఏమార్చేందుకు ప్రయత్నాలు చేయడం ప్రారంభించారు. ఈ చట్టంతో కౌలుకార్డులు అందకపోవడంతో, బీమా, పంట నష్టపరిహారం వంటి ఏ ఒక్క ప్రభుత్వ సాయమూ కౌలురైతులకు అందకుండా పోయింది. చివరికి తాను పండించిన పంటను సైతం కౌలురైతులు తన పేరున అమ్ముకునేందుకు వీల్లేకుండా వైసిపి చేసిన చట్టం తయారైంది. దీంతో కష్టం ఊబిలో కూరుకుపోవడంతో కౌలురైతుల ఆత్మహత్యలు పెరిగిపోయాయి. కొత్త కౌలుచట్టంపై తేలుత హడావుడి.. తర్వాత మౌనంతాము అధికారంలోకి వస్తే కొత్త కౌలుచట్టం తీసుకొచ్చి కౌలురైతులకు న్యాయం చేస్తామని టిడిపి కూటమి చెప్పింది. అధికారంలోకి వచ్చిన వెంటనే కౌలుచట్టం ముసాయిదా తయారు చేసేందుకు అభిప్రాయ సేకరణ పేరుతో జిల్లా వారీగా కొన్నిచోట్ల సమావేశాలు నిర్వహించింది. శీతాకాల సమావేశాల్లో కొత్త కౌలుచట్టం చేస్తామంటూ హడావుడీ చేసింది. జిల్లాలో సమావేశం ఏర్పాటుకు సంబంధించిన రెండు సార్లు తేదీలు ప్రకటించి రద్దు చేసింది. ఆ తర్వాత కౌలుచట్టం ఊసే లేకుండా పోయింది. శీతాకాల సమావేశాలు ముగిసిపోయాయి. ఫిబ్రవరి చివరి వారంలో బడ్జెట్ సమావేశాలు నిర్వహించేందుకు ప్రభుత్వం చూస్తోంది. బడ్జెట్ సమావేశాల్లో కొత్త కౌలుచట్టం తెస్తారా లేక రైతులను మోసం చేస్తారా తేలిపోనుంది. భూ యజమానుల ఒత్తిడి మేరకు కొత్త కౌలుచట్టంపై ప్రభుత్వం వెనక్కు తగ్గిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కొత్త కౌలుచట్టం చేసి వచ్చే ఖరీఫ్ నుంచి కౌలురైతులకు ప్రభుత్వం అందించే అన్ని పథకాలు అందేటట్లు చేయాలని కౌలురైతులు ఆశగా పరిస్థితి నెలకొంది. కొత్త కౌలుచట్టం చేస్తే లబ్దిపొందే వారిలో జిల్లాలోని రైతులే ఎక్కువగా ఉంటారు. జిల్లాకు చెందిన మంత్రులు, ఎంఎల్ఎలు సైతం కౌలుచట్టం గురించి మాట్లాడకపోవడం ఆశ్చర్యంగా ఉంది. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటుందో లేదో చూడాల్సి ఉంది.

రోడ్డు ప్రమాదాలు తగ్గాలి

- జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జిల్లాలో రోడ్డు ప్రమాదాలు తగ్గించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా నేషనల్ హైవే, ఆర్అండ్‌బి తదితర శాఖల అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో డిస్ట్రిక్ట్ రోడ్ సేఫ్టీ కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నేషనల్ హైవే ల్లో నిబంధనల ప్రకారం సైన్ బోర్డులు, రంబుల్ స్ట్రిప్స్, స్పీడ్ బ్రేకర్స్ తదితర చర్యలు తీసుకున్నారా లేదా అన్ని జాతీయ రహదారులపై సంబంధిత శాఖల అధికారుల టీమ్‌తో వెళ్లి పరిశీలించాలని ఆర్అండ్‌బి ఎస్ఇని ఆదేశించారు. వారం, పది రోజుల్లోపు ఈ ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. ఇప్పటి వరకు నేషనల్ హైవేలో 37 బ్లాక్ స్పాట్లలో ఏర్పాటుచేసిన సైన్ బోర్డులు రంబుల్ స్ట్రిప్స్ స్పీడ్ బ్రేకర్లు తదితర చర్యలకు సంబంధించిన ఫోటోలను పంపించాలని ఆదేశించారు. కోడుమూరు రోడ్‌లో ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని, నివారణకు పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని ఆర్అండ్‌బి ఎస్ఇని ఆదేశించారు. ప్రతి నెల సమావేశానికి వచ్చే ముందు రహదారుల భద్రతకు సంబంధించి మరమ్మతులు ఎక్కడ చేయాలి, మన పరిధిలో చేయగలిగినవి ఎవి, ఏపనులు చేపట్టాల్సి ఉన్న పూర్తి వివరాలతో, సరైన అంచనా నివేదికలతో రావాలన్నారు. ఎల్కూరు గుడి దగ్గర అప్రోచ్ రోడ్డుకు సంబంధించి త్వరితగతిన భూసేకరణను పూర్తి చేయాలని ఎన్‌హెచ్ అధికారులను ఆదేశించారు. పెద్దపాడు నుండి హైదరాబాద్ ఎన్‌హెచ్‌కు లింక్ చేస్తూ ఔటర్ రింగ్ రోడ్ ఏర్పాటుకు సంబంధించి 6.5 కిలోమీటర్ల కోసం భూ సేకరణకు ఎంత ఖర్చు అవుతుందో నివేదిక సమర్పించాలని అడిషనల్ మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. ఔటర్ రింగ్ రోడ్ నిర్మాణం వల్ల ట్రాఫిక్ రద్దీ చాలా తగ్గుతుందని అభిప్రాయపడ్డారు. సూరత్ హైవే రోడ్డు పనులు ఎప్పుడు పూర్తి చేస్తారని సంబంధిత ఎన్‌హెచ్ పిడిని అడిగి తెలుసుకున్నారు. బళ్లారి చౌరస్తా వద్ద ఉన్న ఆంజనేయ స్వామి గుడి దగ్గర ఫ్రీ లెఫ్ట్, బస్ స్టాండ్ నుండి బెంగళూర్ రోడ్ కు వెళ్లే వాహనాల కోసం ఫ్రీ లెఫ్ట్ ఏర్పాటుపై అధికారులతో చర్చించారు. ఇందుకు సంబంధించి త్వరితగతిన అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ సర్వజన వైద్యశాల బయట ట్రాఫిక్ రద్దీ తగ్గించే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని హాస్పిటల్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌ను ఆదేశించారు. రాజ్ విహార్ వద్ద శాటిలైట్ బస్‌స్టాండ్ ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆర్‌టిసి ఆర్ఎంను ఆదేశించారు. నేషనల్ హైవేలపై సిటీ స్ట్రాంగ్ ప్లేస్ నుండి సిసి కెమెరాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జిల్లా ఎస్‌పి విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ గ్రామం నుండి హైవేకు కనెక్ట్ అయ్యే అప్రోచ్ రోడ్ల వద్ద స్పీడ్ బ్రేకర్లు తప్పకుండా ఏర్పాటు చేయాలన్నారు. ఎక్కడ ఏర్పాటు చేయాలో వివరాలు ఇస్తామన్నారు. నేషనల్ హైవేపై కొన్ని బ్లింకర్లు లేవని, డార్క్‌గా ఉందని, మళ్లీ కలర్ బ్లింకర్లు ఏర్పాటు చేయాలన్నారు. రేడియం, జిగ్‌జాగ్‌లను ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, ఆర్‌అండ్‌బి ఎస్ఇ మహేశ్వర్ రెడ్డి, పంచాయతీ రాజ్ ఎస్ఇ రామచంద్రారెడ్డి, డిటిసి శాంత కుమారి, ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ ఎఒ సింధు సుబ్రమణ్యం, నేషనల్ హైవే పిడిలు పాల్గొన్నారు.

ఆయుష్మాన్ నర్సింగ్ కళాశాలపై చర్యలు తీసుకోవాలి

- దున్నపోతుకు వినతిపత్రంతో నిరసన

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

కర్నూల్ నగరంలోని అక్రమంగా షిఫ్టింగ్ చేసి, విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతూ, అక్రమంగా అధిక ఫీజులు వసూలు చేస్తున్న ఆయుష్మాన్ నర్సింగ్ కళాశాలపై చర్యలు తీసుకోవాలని అధికారులకు వినతి పత్రాలు ఇచ్చిన దున్నపోతుపై వాన కురిసినట్టు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఎస్ఎఫ్ఐ నగర అధ్యక్షులు అబూబకర్, నాయకులు బాబీ, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాఘవేంద్ర, నగేష్ నాయకులు కృష్ణలు కలిసి దున్నపోతుకు వినతి పత్రం ఇచ్చి నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ కన్వీనర్ కోటాలో చేరిన వారికి సంవత్సరానికి రూ.16వేలు ఫీజు కట్టాలని, యూనివర్సిటీ నిర్దేశిస్తే రూ.70 వేలు కట్టినా కూడా రెండో సంవత్సరం పరీక్షలకు ఫీజు కట్టలేదని, విద్యార్థిని పరీక్షలకు దూరం చేసిన అహంకారి ఆయుష్మాన్ కళాశాల యజమాన్యంపై చర్యలు తీసుకొని తక్షణమే ఆ కళాశాల గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. డీఎంహెచ్వో, జెసికి వినతి పత్రాలు ఇచ్చినప్పటికీ, విద్యార్థి తండ్రి యూనివర్సిటీ అధికారులకు వినతి పత్రాలు అందించిన ఇప్పటిదాకా ఎలాంటి చర్యలు తీసుకోకుండా అహంకారంతో వ్యవహరిస్తూ అడ్డగోలుగా ఫీజులు వసూలు చేస్తూ, అడ్డగోలుగా కళాశాలను షిఫ్ట్ చేస్తూ నిర్వహిస్తున్న ఎందుకు పట్టించుకోవట్లేదని ప్రశ్నించారు. కరస్పాండెంట్ అహంకారంతో విద్యార్థి జీవితాన్ని నాశనం చేశాడని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆయుష్మాన్ నర్సింగ్ కళాశాల గుర్తింపు రద్దుచేసి, నష్టపోయిన విద్యార్థికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనకు దిగవలసి వస్తుందని హెచ్చరించారు.

దున్నపోతకు వినతి ఇస్తూ
నిరసన తెలుపుతున్న నాయకులు

తుంగభద్రపై బ్రిడ్జి కం బ్యారేజీపై కర్ణాటకతో చర్చించాలి

- రైతులకు న్యాయం జరిగేలా చూడాలి
- రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి

ప్రజాశక్తి - కౌతాళం

తుంగభద్ర నదిపై బ్రిడ్జ్ కం బ్యాలెట్ కోసం కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వంతో మన రాష్ట్ర ప్రభుత్వం చర్చలు జరిపి రెండు రాష్ట్ర రైతులకు న్యాయం జరిగేలా చూడాలని రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం రైతు సంఘం బృందం కర్నూలు జిల్లా కౌతాళం మండలం కుంభలనూర్ గ్రామం వద్ద తుంగభద్ర నదిలో బ్రిడ్జ్ కం బ్యారేజ్ నిర్మాణం కోసం చూసిన ప్రదేశాలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ కర్ణాటక రాష్ట్రం రాయచూరు జిల్లా మాన్వి తాలూకా చికల పరివి, మన రాష్ట్రం కర్నూల్ జిల్లా కౌతాళం మండలం కుమ్మలనూరు గ్రామం కలుపుతూ తుంగభద్ర నదిపై బ్రిడ్జ్ కం బ్యారేజ్ 0.35 టిఎంసిల సామర్థ్యంతో నిర్మాణం కోసం కర్ణాటక ప్రభుత్వం రూ.391.50 కోట్లతో ప్రతిపాదనలతో సిద్ధంగా ఉందన్నారు. ఇదే ప్రభుత్వం రాయచూరు జిల్లా చిన్న మంచాల, ముఖ పుణ్యక్షేత్రమైన మంత్రాలయంను కలుపుతూ మరో బ్రిడ్జ్ కం బ్యారేజ్ కోసం రూ.350 కోట్లతో 0.31 టిఎంసి సమర్థంతో ముందుకు వచ్చిందన్నారు. కర్ణాటక ప్రభుత్వం పనుల కోసం వేగంగా అడుగులు వేస్తుంటే, మన కూటమి ప్రభుత్వం నిద్రమత్తులో ఉందని విమర్శించారు. రైతుల పట్ల నిర్లక్ష్యంగా వివరించడం తగదని అన్నారు. అయితే తుంగభద్ర నదిపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టడం వలన రెండు రాష్ట్రాల్లో రవాణా సౌకర్యాలు పెరుగుతాయన్నారు. దీంతో వాణిజ్య వ్యాపార సంబంధాలు పెరగడమే కాకుండా ఎన్నో సౌకర్యాలు పెరుగుతాయన్నారు. బ్యారేజ్ నిర్మాణాల వల్ల కర్నూల్ జిల్లా రైతులకు న్యాయం జరిగే విధంగా ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేశారు. కర్ణాటక రాష్ట్ర రైతులతో పాటు, కర్నూలు జిల్లాపై భాగంలోని పశ్చిమ ప్రాంతం, క్రింది భాగంలోని నియోజక వర్గాల రైతులకు న్యాయం జరిగేలా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. జిల్లాలోని ఎంపీలు ఎమ్మెల్యేలు రైతులకు సాగునీటి విషయంలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి కర్ణాటక ప్రభుత్వంతో చర్చించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సిఎం చంద్రబాబు నాయుడు, కూటమి నాయకులు ప్రతి ఎకరాకు సాగునీరు అందిస్తామని మాటలు చెప్పడం కాదని, ప్రాజెక్టుల విషయంలో స్పందించాలని కోరారు.

మాట్లాడుతున్న కె.ప్రభాకర్ రెడ్డి

వరద కాలువ పనులు ప్రారంభించాలి

- రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వెంకటేష్

జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో వ్యవసాయ రంగం అభివృద్ధి చెందాలంటే తుంగభద్ర నదిపై మేలిగనూరు వద్ద వరద కాలువ నిర్మించాలని, ఆర్డీఎస్ కుడికాలువ పనులు వెంటనే చేపట్టాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వెంకటేష్ డిమాండ్ చేశారు. వేల ఎకరాల్లో మెట్ట భూములు ఉన్నాయని, సాగునీరు లేకపోవడంతో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారన్నారు. దీంతో ఉపాధి అవకాశాలు లేక వలసలు తిరుగుతున్నాయన్నారు. వర్షాకాలంలో తుంగభద్ర నది నుండి సుమారు 100 టిఎంసిల నీరు సముద్రం పాలవుతుందన్నారు. వరద జలాలను వరద కాలువ ద్వారా జిల్లా రైతులకు తాగు సాగునీరు అందించవచ్చన్నారు. దీంతో వ్యవసాయ రంగం అభివృద్ధి చెంది ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు. వలసలు కూడా నివారించవచ్చని పేర్కొన్నారు. జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు రామాంజనేయులు, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మల్లయ్య, మండల అధ్యక్షులు ఈరన్న, రైతు సంఘం నాయకులు నగేష్, హనుమంతు, మహాదేవ, వడ్డే ఈరన్న తదితరులు పాల్గొన్నారు.

కార్మిక చట్టాలను పునరుద్ధరణ చేయాలి

- ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఆంజనేయులు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

దేశవ్యాప్తంగా జర్నలిస్టుల హక్కుల కోసం ఉన్న కార్మిక చట్టాలను రద్దు చేయడం సరైంది కాదని తక్షణం కార్మిక చట్టాల స్థానంలో కేంద్ర ప్రభుత్వం తెచ్చిన లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ రాష్ట్రప్రధాన కార్యదర్శి జి.ఆంజనేయులు డిమాండ్ చేశారు. మంగళవారం కర్నూలు నగరంలోని లలిత కళ సమితిలో ఎపిడబ్ల్యుజెఎఫ్ జిల్లా కన్వినింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లా కన్వీనర్ నాగేంద్ర అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశానికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆంజనేయులు మాట్లాడుతూ జర్నలిస్టులకు భద్రత కరువైందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల కాలంలో ప్రభుత్వాలు జర్నలిస్టులపై కక్షలు కట్టి అక్రమంగా కేసులు బనాయించారని తెలిపారు. దేశంలో చాలా రాష్ట్రాలు జర్నలిస్టులకు పెన్షన్ పథకం అమలు చేస్తున్నాయని, ఎపి రాష్ట్ర ప్రభుత్వం కూడా పెన్షన్ పథకం అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని ప్రభుత్వాలు జర్నలిస్టులకు వచ్చేలోపు ఇళ్ల స్థలాల విషయంలో అనేక రకాల మెలికలతో కాలయాపన చేస్తున్నారన్నారు. తక్షణం జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని అన్నారు. రాష్ట్రంలోని అర్హులైన వారికి అక్రిడేషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టుల హక్కుల సాధనకోసం సంఘాన్ని బలోపేతం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి టి.మద్దిలేటి, రాష్ట్రనాయకులు బి.గోరంట్లప్ప, కెబి. శ్రీనివాసులు, ఫోటో గ్రాఫర్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు డి.హుస్సేన్, సీనియర్ నాయకులు పానుగంటి చంద్రయ్య, పాణ్యం నియోజకవర్గ కార్యదర్శి సుజాత, ఎమ్మిగనూరు నియోజకవర్గ అధ్యక్షుడు షబ్బీర్, ఆదోని నియోజకవర్గ నాయకులు తిమ్మప్ప, మధు, బ్రహ్మయ్య, సునీల్ కుమార్ ,కర్నూలు నగర కార్యదర్శి ఎర్రమల,తదితరులు పాల్గొన్నారు.

ఎపిడబ్ల్యుజెఎఫ్ నగర కమిటీ ఎన్నిక

ఎపిడబ్ల్యుజెఎఫ్ నూతన కమిటీగా కర్నూలు నగర గౌరవాధ్యక్షులుగా బి.శివకుమార్,(ప్రెస్ పవర్)నగర అధ్యక్షుడుగా శివశంకర్ (సాక్షి)నగర ప్రధాన కార్యదర్శి గా ఎర్రమల, (మీడియా నాడీ) లతోపాటు పలువురు సభ్యులను ఎన్నుకున్నారు.

మాట్లాడుతున్న జి.ఆంజనేయులు

ప్రయివేటీకరణ వైపు ఆర్‌టిసి అడుగులు

-2029 నాటికి 100శాతం విద్యుత్ బస్సులు
- కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో ఉద్యోగాలు భర్తీ
- ఉద్యోగ భద్రత కరువు - అధికం కానున్న అద్దె బస్సులు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

రాష్ట్ర ప్రభుత్వం జిఒ నెంబర్ 88, 2024 డిసెంబర్ 11 ద్వారా 2029 నాటికి 100 శాతం ఆర్‌టిసి బస్సులను విద్యుత్ బస్సులుగా మార్చాలని జిఒ ఇచ్చింది. పిఎం-ఇ బస్సు సేవా పథకం ప్రకారం ఎపిలోని 11 ప్రధాన నగరాలలో 750 విద్యుత్ బస్సులు ప్రవేశపెట్టాలని ప్రపోజ్ చేస్తూ డిప్యూటి సిఎంఇ , డిపిటిఒలకు గతేడాది డిసెంబర్11న ఒక లెటర్ ఇచ్చారు. ఈ పాటికే ఆర్‌టిసిలో ఉన్న 11,216 బస్సులలో 2,751 బస్సులు అద్దె బస్సులు ఉన్నాయి. ఈ అద్దె బస్సులలో 100 బస్సులు విద్యుత్ అద్దె బస్సులు. ఈ 100 బస్సులలో ఒక్క ఆర్‌టిసి ఉద్యోగి కూడా పనిచేయడం లేదు. అంతా ప్రైవేటు వ్యక్తులే. ప్రస్తుతానికి రాబోయే 750 విద్యుత్ బస్సులు కూడా ప్రైవేటు వ్యక్తులే నిర్వహిస్తారు. 750 బస్సులు వస్తే మొత్తం 3,700 వరకు ఆర్‌టిసి ఉద్యోగులు ,డ్రైవర్లు, మెకానిక్, కండక్టర్లు మిగులు తేల్చబడతారు. వారికి ఉద్యోగ భద్రత ఉండదు. దీనికి ప్రత్యామ్నాయంగా, విద్యుత్ బస్సులను ఆర్‌టిసి ద్వారా నిర్వహిస్తే ఇవన్నీ ప్రభుత్వ బస్సులు అవుతాయి. ఆర్‌టిసిలో ప్రస్తుతం అత్యంత నైపుణ్యం గల డ్రైవర్లు, ప్రయాణికుల 129 డిపో లకు రిజర్వేషన్లు అమలు అవుతాయి. అలా కాకుండా 2029 నాటికి అన్ని ప్రైవేటు విద్యుత్ బస్సులే వస్తే ఆర్‌టిసి ఉద్యోగుల ఉద్యోగాలకు భద్రత ఉండదు. ప్రజలకు కూడా దీనివల్ల చార్జీల భారం పెరుగుతుంది. ఇప్పుడు ఆర్‌టిసిలో ప్రమాద రేటు 0.08. ఇది అత్యంత తక్కువ. కానీ ప్రైవేటు బస్సులు వస్తే ప్రమాదాలు పెరిగే అవకాశం ఉంది. ప్రస్తుతం ఆర్‌టిసిలో ఉన్న 7,410 బస్సులతో 25 శాతం వరకు స్క్రాప్ దశకు చేరుకొని ఉన్నాయి. ఉగాది నుంచి మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని ప్రవేశ పెట్టబోతున్నట్లు ప్రకటించారు. దీనికై అదనంగా 2000 బస్సులు, పదివేల మంది సిబ్బంది అవసరం అవుతారు. ప్రస్తుతం కొనబోతున్న 750 విద్యుత్ బస్సుల బదులుగా డీజిల్ బస్సులే కొంటే ప్రభుత్వానికి మంచి పేరు వస్తుంది. ఒక విద్యుత్ బస్సుకు ఐదు డీజిల్‌తో నడిపే సూపర్ లగ్జరీ బస్సులు లేదా ఎనిమిది ఆర్డినరీ బస్సులు వస్తాయి. విద్యుత్ బస్సులు ప్రవేశపెడితే వాతావరణ కాలుష్యం తగ్గుతుందని చెప్పటం సరికాదు. మనదేశంలో వాతావరణలో 50శాతం పరిశ్రమల నుంచి వస్తే, కేవలం 25 శాతం మాత్రమే వాహనాల నుంచి వస్తుంది. వాహనాలలో టూ వీలర్స్, కార్లు, జీబులు ఆటోలు లారీలు మొదలగునవి భారీ సంఖ్యలో ఉన్నాయి. కేవలం బస్సుల ద్వారా వచ్చే వాతావరణ కాలుష్య శాతం 0.69. దేశంలో మొత్తం 10 లక్షల బస్సులు ఉంటే వీటిలో ఆర్‌టిసి బస్సులు 1,35,000 మాత్రమే. ఆర్‌టిసి బస్సుల ద్వారా వచ్చే కాలుష్యం అయితే ఇది ఇంకా చాలా తక్కువగా 0.07 శాతం మాత్రమే ఉంటుంది. ఇది అత్యంత తక్కువ. నిజంగా వాతావరణ కాలుష్యం తగ్గాలంటే వ్యక్తిగత వాహనాలకు స్వస్తి చెప్పి ప్రభుత్వం ప్రజా రవాణా ఆర్‌టిసిలను బలోపేతం చేయాలి. ఆర్‌టిసి చట్టం 1950 ప్రకారం ఆర్‌టిసి బస్సులకు బడ్జెట్ కేటాయింపులు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేయడం లేదు. ఈ విషయమై ఆర్‌టిసి సిబ్బందికి అవగాహన కల్పించి దీనివల్ల కలిగే ప్రయోజనాలు నష్టాలను గురించి చర్చించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

విద్యుత్ బస్సుల నిర్వహణ ఆర్‌టిసిలకే ఇవ్వాలి

పర్యావరణం పేరుతో ఆర్‌టిసి విద్యుత్తు బస్సుల నిర్వహణ మొత్తం ప్రైవేట్ వ్యక్తులకు అప్పజెప్పడం సరైనది కాదు. విద్యుత్ బస్సుల నిర్వహణను కేంద్రం ఆర్‌టిసికే ఇవ్వాలి. 2030 నాటికి మొత్తం విద్యుత్ బస్సులను ప్రవేశపెట్టి కార్పొరేట్లకు అప్పజెప్పడం న్యాయం కాదు. విద్యుత్ బస్సులపై వచ్చే సబ్సిడీ మొత్తం పెంచి ఆర్‌టిసిలకు ఇవ్వాలి. విద్యుత్ బస్సుల నిర్వహణకు తగిన ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అవసరమైన నాలుగు వర్క్ షాపులు ఆర్‌టిసికి ఉన్నాయి. సమర్థులైన మెకానికల్ సిబ్బంది ఆర్‌టిసికి ఉన్న మరో ప్రత్యేకత! దేశంలోనే అతి తక్కువ ప్రమాద రేటుతో మన ఆర్‌టిసి ఉన్నది. అందుకు డ్రైవర్ల సామర్థ్యం కారణం! కాబట్టిప్రజా రవాణా అయినా ఆర్‌టిసిలను బలోపేతం చేయాలి. విస్తరించాలి, విద్యుత్ బస్సులను కేటాయించి నిరుద్యోగ యువకులకు ఉపాధి కల్పించడంతోపాటు ప్రయాణికులకు భద్రతతో కూడిన హామీ కోసం ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవాలని ఎస్‌డబ్ల్యుఎఫ్ కోరుతుంది.

- ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర కోశాధికారి జె. దివాకర్.

విద్యుత్ బస్సులతో యువత ఉపాధి కోల్పోతారు

కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాల వల్ల యువత ఉద్యోగ, ఉపాధి, అవకాశాలు కోల్పోతారు. అంతేకాక ప్రస్తుతం ఔట్‌సోర్సింగ్, అప్రెంటిషిప్‌కు జిల్లాలో 300 మందిని తీసుకున్నారు. అందుకు కర్నూలు 55 మందిని తీసుకుంటున్నట్లు సమాచారం. వారిలో ఐటిఐ చేసి మెకానికల్ ఫీల్డ్‌లో ఫిట్టర్, మోటర్ మెకానిక్‌లను తీసుకుంటున్నారు. ఉగాదికి మహిళలకు ఉచిత బస్సులు నడపాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తుంది. ఈ సందర్భంగా అదనంగా బస్సులు రావాల్సి ఉంటుంది. వాటి నిర్వహణకు సిబ్బంది అవసరం. ప్రభుత్వం నిరుద్యోగులకు ఉపాధి కల్పించే దిశగా అడుగులు వేయాలి. విద్యుత్ బస్సులో కేవలం 300 కిలోమీటర్ల లోపు చార్జింగ్ ద్వారా తిప్పేందుకు అవకాశం ఉంటుంది. పర్యావరణ పరిరక్షణ పేరుతో విద్యుత్ బస్సులను నడపాలనుకోవడం సరైంది కాదు. ప్రస్తుతం పని చేస్తున్న ఉద్యోగులకు మూడు డిఎలు రావాలి. పే స్కేల్ అరియర్స్ రావాల్సి ఉంది. వాటిని ప్రభుత్వం విడుదల చేసి ఆదుకోవాల్సిన అవసరం ఉంది.

- ఎపిఎస్ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ టు డిపో కార్యదర్శి జి.మహేశ్వరరావు.

కనీస పెన్షన్ రూ.9 వేలు ఇవ్వాలి

- ఇపిఎఫ్ కార్యాలయం ముందు ధర్నా

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ఈనెల 11, 12 తేదీలలో ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద జరుగుతున్న ధర్నాకు మద్దతుగా కర్నూలు నగరంలో అశోక్ నగర్‌ని ఇపిఎఫ్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు బిఎస్ఎన్ఎల్ అసోసియేషన్ నాయకులు యాకోబ్ అధ్యక్షత వహించారు. ధర్నా కార్యక్రమానికి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి అంజిబాబు, సిఐటియు నగర కార్యదర్శి సిహెచ్ సాయి బాబా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ ఈనెల 11, 12వ తేదీల్లో ఢిల్లీ నగరంలోని జంతర్మంతర్ దగ్గర ధర్నా కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఆ ధర్నాకు మద్దతుగా మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా ఈపీఎఫ్ కార్యాలయాల దగ్గర ధర్నా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. కనీస పెన్షన్ నెలకు 9వేలు ఇవ్వాలని ఉచిత వైద్య సౌకర్యం కల్పించాలని, హయ్యర్ పెన్షన్ ఆప్షన్ అందరికీ వర్తింపజేయాలని, రైల్వే చార్జీలలో రాయితీ కల్పించాలని, ఉచిత ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని తెలిపారు. ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ సభ్యులు కె. సుధాకరప్ప, బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు మహేశ్వరరావు మాట్లాడుతూ వివిధ పారిశ్రామిక వాడలలో పని చేస్తూ పెన్షన్ పొందుతున్న వారు దేశంలో 75 లక్షల మంది రాష్ట్రంలో లక్ష యాభై వేల మంది ఉన్నారని తెలిపారు. కర్నూలు నగరంలో బిఎస్ఎన్ఎల్, పేపర్ మిల్లు, గ్లాస్ ఫ్యాక్టరీ, పాలడైరీ, బిర్లా కంపెనీ, ఆర్టీసీ, కార్బైడ్, ఎంజీ బ్రదర్స్ ,ఆయిల్ మిల్లులు తదితర సంస్థలలో 20, 30 సంవత్సరాలుగా పనిచేస్తూ రిటైర్డ్ అయిన తరువాత వచ్చే పెన్షన్ వేయి రూపాయల లోపు ఉందని, ఈ పెన్షన్‌తో ఎలా బతకాలని ప్రశ్నించారు. గత ఎన్నికల్లో నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చాక కనీస పెన్షన్ ఇస్తామని వాగ్దానం చేసి 11 సంవత్సరాలు అవుతోందని తెలిపారు. గత సంవత్సర కాలంగా కనీస పెన్షన్ 9 వేలు ఇవ్వాలని అనేక రూపాలలో ఆందోళనలు చేసినా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు చలనం లేకుండా పోయిందని వారు తెలిపారు. ప్రస్తుతం సామాజిక పెన్షన్ రూ.3వేలు ఇస్తున్నారని 20, 30 సంవత్సరాలుగా పనిచేస్తూ జమచేసిన ఈపీఎఫ్ వేలకోట్ల రూపాయలు ప్రభుత్వం దగ్గర ఉన్న పెన్షన్ పెంచడానికి ప్రభుత్వానికి చేతులు రావడంలేదని తెలిపారు. వచ్చే వెయ్యి రూపాయలు పెన్షన్ వైద్య ఖర్చులకు కూడా సరిపోవడం లేదని, ధరల పెరుగుదలకు అనుకూలంగా కేంద్ర ప్రభుత్వం ఈ పార్లమెంటు సమావేశాల్లో పెన్షనర్లకు నిధులు కేటాయించకుండా అన్యాయం చేసిందని తెలిపారు. కార్యక్రమంలో ఆంధ్రా గ్లాస్ ఫ్యాక్టరీ, పేపర్ మిల్లు, పాల డైరీ, బిఎస్ఎన్ఎల్, ఆర్టీసీ కార్మికులు, జె శంకర్రావు, బి.మోహన్, బి. రామన్న, చంద్రశేఖర్ రెడ్డి, చెన్నకేశవులు, నాగ గోపాల్, కెవి మురళీమోహన్రావు, వెంకటేశ్వర్లు, నరసింహులు, ఇసాక్, సయ్యద్ వలి, సూర్యనారాయణ, దాసు, అబ్దుల్ సుభాన్ తదితరులు పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న నాయకులు

ఎల్ఐసిలో నియామకాలు చేపట్టాలి

ఈనెల 20న గంట పాటు నిరసన

ప్రజాశక్తి -కర్నూలు కార్పొరేషన్

ఎల్ఐసి లో కేవలం ఈ ఆర్థిక సంవత్సరం 9 నెలల లోనే 3,130 మంది క్లాస్ 3, 4 తరగతుల్లో సిబ్బంది తగ్గిందని, పాలసీదారులకు మెరుగైన సేవలందించేందుకు నూతన నియామకాలు తక్షణ అవసరమని ఎల్ఐసి ఉద్యోగుల సంఘం కర్నూలు కార్యదర్శి సునీయ కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ఎల్ఐసి ప్రధాన కార్యాలయం వద్ద బ్రాంచ్ అధ్యక్షుడు అవధానం మక్బూల్ అహ్మద్ ఆధ్వర్యంలో దేశవ్యాప్త పిలుపుమేరకు జరిగిన నిరసన కార్యక్రమంలో సునీయ కుమార్ మాట్లాడారు. సంస్థలో నూతన నియామకాలు చాలాకాలంగా జరగడంలేదని, తక్షణం ఈ క్యాడర్లలో రిక్రూట్మెంట్ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఎల్ఐసి లో 86శాతం మంది సిబ్బందికి ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (ఎఐఐఇఎ) ప్రాతినిధ్యం వహిస్తోందని, బ్యాంకులలో, సాధారణ బీమా రంగంలో, ఇతర రంగాలలో ఇచ్చినట్టుగా తమ సంఘానికి కూడా గుర్తింపు పునరుద్ధరించాలని అన్నారు. లేనిపక్షంలో ఫిబ్రవరి 20 న గంటపాటు దేశవ్యాప్తంగా ఎల్ఐసి సిబ్బంది సమ్మె నిర్వహిస్తారని తెలిపారు. అనంతరం యూనియన్ ప్రతినిధి బృందం చీఫ్ మేనేజర్ కర్నూల్ ఇస్సాక్ అహ్మద్‌కు వినతి పత్రం సమర్పించారు. నూతన నియామకాలు, యూనియన్ గుర్తింపు అంశాలపై తమ ఆకాంక్షలను ఎల్ఐసి సిఇఒకు తెలియజేయాలని విజ్ఞప్తి చేసింది. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు మక్బూల్ అహ్మద్, రమేష్, ఉస్మాన్ గని తదితరులు పాల్గొన్నారు.

కర్నూలులో నిరసననుద్దేశించి మాట్లాడుతున్న సునియకుమార్

ఆదోని : ఎల్ఐసిలో 3, 4 తరగతుల శ్రేణి నూతన ఉద్యోగ నియామకాలు చేపట్టాలని ఎల్ఐసి ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి పిఎస్.రవిబాబు డిమాండ్ చేశారు. మంగళవారం ఆదోని బ్రాంచ్ కార్యాలయం ముందు సంఘం అధ్యక్షుడు ప్రకాష్ ఆధ్వర్యంలో ఉద్యోగులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా రవిబాబు మాట్లాడారు. ఎల్ఐసిలో కేవలం ఈ ఆర్థిక సంవత్సరం 9 నెలల్లోనే 3,130 మంది క్లాస్ 3, 4 తరగతుల శ్రేణి ఉద్యోగులు తగ్గారని, పాలసీదారులకు మెరుగైన సేవలందించేందుకు ఉన్నవారు ఇబ్బంది పడుతున్నారన్నారు. నూతన నియామకాలు తక్షణ అవసరమన్నారు. సంస్థలో నూతన నియామకాలు చాలాకాలంగా జరగడం లేదని, ఈ క్యాడర్లలో రిక్రూట్‌మెంట్ చేపట్టాలని డిమాండ్ చేశారు. సీనియర్ బ్రాంచ్ మేనేజర్ బి మునెప్పను కలిసి మెమొరాండం సమర్పించారు. యూనియన్ నాయకులు ధర్మరాజు, ఆర్‌కె.లతా రాజశేఖర్, నంజుండేశ్వర, ప్రతాప్ నాయుడు, శ్రీనివాసరావు, నాగరాజు, ఈరమ్మ వున్నారు

ఆదోనిలో నిరసన తెలుపుతున్న ఎల్ఐసి ఉద్యోగులు

ప్రభుత్వ విద్యాసంస్థలు నిర్వీర్యం

ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్దుల్లా

ప్రజాశక్తి - ఆలూరు

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విద్యా విధానంతో ప్రభుత్వ విద్యా సంస్థలు నిర్వీర్యం అవుతుందని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్దుల్లా అన్నారు. మంగళవారం ఎస్ఎఫ్ఐ 8వ మండల మహాసభ స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించారు. ఈ మహాసభకు మండల అధ్యక్షుడు ఉమేష్ అధ్యక్షత వహించారు. మహాసభను ఉద్దేశించి జిల్లా కార్యదర్శి అబ్దుల్లా మాట్లాడుతూ నూతన విద్యా విధానంతో విద్య మొత్తం కేంద్ర బిజెపి ప్రభుత్వం చేతిలోకి వెళ్లిపోయిందని పేర్కొన్నారు. విద్యను వ్యాపారం చేసి కార్పొరేటీకరణతో డబ్బే ధ్యేయంగా ముందుకు వెళుతున్నారని విమర్శించారు. యూనివర్సిటీలో వ్యాపార కేంద్రంగా మారిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. పేద విద్యార్థులు బడిబయట ఉండాలనే కుట్ర చేస్తున్నారని తెలిపారు. విద్య వ్యాపారమైపోవడంతో ఫీజులు కడితేనే సర్టిఫికెట్స్ ఇస్తామన్న స్థాయికి యాజమాన్యాలు దిగజారిపోయాయని పేర్కొన్నారు. 78 సంవత్సరాల స్వాతంత్ర్య భారతదేశంలో డబ్బు ఉన్న వారికి ఒక విద్య లేని వాడికి మరో విద్య అన్నట్లు తయారైందని ఆవేదన వ్యక్తం చేశారు. ఫీజులు భారమైపోయాయని, తల్లిదండ్రుల ఆదాయం పెరగడం లేదని తెలిపారు. ఫీజు రియంబర్స్‌మెంట్ అందక ఎంతోమంది ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. 2024లో తల్లికి వందనం కూటమి ప్రభుత్వం ఇవ్వలేదని విమర్శించారు. ఎన్‌సిఆర్‌టి పుస్తకాల్లో చరిత్రను వక్రీకరిస్తూ ముద్రించడం దుర్మార్గం అన్నారు. విద్యార్థులు సమాజంలో చోటు చేసుకుంటున్నా పరిణామాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ఉండాలని చెప్పారు. విద్యలో సమాన అవకాశాలు కల్పించడం కోసం ఎస్ఎఫ్ఐ పోరాడుతుందని పేర్కొన్నారు. ఒత్తిడితో విద్యార్థుల ఆత్మహత్యలు పెరిగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల గుండెచప్పుడుగా ఎస్ఎఫ్ఐ పనిచేస్తుందని తెలిపారు. డిగ్రీని నాలుగు సంవత్సరాలు చేసి, ఇంటర్న్‌షిప్ పేరుతో విద్యార్థులకు నైపుణ్యం నేర్పించకుండా బానిసలుగా చూస్తున్నారని చెప్పారు. ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకుంటేనే దేశానికి భవిష్యత్తు ఉంటుందని పేర్కొన్నారు. ఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా ఉపాధ్యక్షుడు మైన మాట్లాడుతూ విద్యారంగ సమస్యలపై పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. డిగ్రీ విద్యార్థులకు రూ.3,480 కోట్లు ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలు ఉన్నాయని చెప్పారు. ఫీజులు చెల్లించకపోవడంతో సర్టిఫికెట్లు కళాశాలలో నిలిచిపోయాయని పేర్కొన్నారు. ఉపాధి లేక రోడ్ల పైన తిరుగుతున్నారని తెలిపారు. సొంత భవనాల్లో ప్రభుత్వ హాస్టలను కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల ఉపాధ్యక్షులు బసవరాజు, బోటయ్య, షాషా, ప్రశాంత్, పరమేష్, మల్లికార్జున, నిఖిల్, డాకే నాయక్, ఉపేంద్ర విద్యార్థులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్దుల్లా

తాగునీటి సమస్య రానివ్వొద్దు

ప్రజాశక్తి- ఆదోని : ఆదోని పట్టణ ప్రజలకు ఎండాకాలంలో తాగునీటి ఎద్దడి రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని టిడిపి సీనియర్ నాయకుడు వ్యవసాయ మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ సూరం భాస్కర్ రెడ్డి కోరారు. మంగళవారం ఆదోని మున్సిపల్ కమిషనర్ కృష్ణతో కార్యాలయంలో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బసాపురం సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ పరిస్థితి గురించి అడిగారు నిలువ ఉన్న నీరు ప్రజలకు సరిపోతాయా లేక ప్రత్యామ్నయంగా ఆలోచన ఏమిటని అడిగారు. కాలువ నీటి ప్రభావం నిలిచి పోతే నీటి ఎద్దడి ఏర్పడితే పరిస్థితి తీవ్రంగా ఉంటుందని అలాంటి సమస్య రాకుండా ఇప్పుడే స్పందించాలని విజ్ఞప్తి చేశారు. కమిషనర్ కృష్ణ మాట్లాడుతూ సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌లో 70 శాతం నీరు నిలువకు అవకాశం ఉందని ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు. ప్రస్తుతం 67శాతం నీటి నిలువ ఉందన్నారు. ఆదోని పట్టణ ప్రజలకు వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా రామజల చెరువులో నీటిని నింపుతున్నామన్నారు. సూరం భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ రంజాల చెరువులో నీరు తాగడానికి అనుకూలంగా లేదని ప్రజలు చర్చించుకుంటున్నారన్నారు. చెత్తాచెదారం వేయడం వల్ల నీరు కలుషితమయ్యే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. కమిషనర్ మాట్లాడుతూ రాంజల నీటిని ఇప్పటికే మూడుసార్లు టెస్టింగ్ కోసం ల్యాబ్ కు పంపామన్నారు. తాగడానికి అనుకూలంగా ఉన్నాయని శాస్త్రీయంగా రిపోర్టు వచ్చిందన్నారు. ఆదోని పట్టణ ప్రజలకు తాగునీటి ఎద్దడి కోసం సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు సామర్థ్యం పెంచాల్సిన అవసరం ఉందన్నారు. అందుకు సుమారు రూ.150 కోట్లు అవసరం ఉందని తెలిపారు. ఎండాకాలం తాగునీటి ఎద్దడి రాకుండా అన్ని చర్యలు తీసుకున్నామని కమిషనర్ తెలిపారు. ఆయనతోపాటు సీనియర్ నాయకుడు మాజీ కౌన్సిలర్ రామచంద్ర ,సతీష్ ఉన్నారు.

మున్సిపల్ కమిషనర్‌తో మాట్లాడుతున్న నాయకులు భాస్కర్‌రెడ్డి

సామాజిక తనిఖీ

రికవరీ ఆదేశించిన పిడి వెంకటరమణయ్య

ప్రజాశక్తి- కౌతాళం

మహాత్మగాంధీ జాతీయఉపాధి హామీ పథకం పనులపై స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ సుబ్బరాజు అధ్యక్షతన, ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటరమణయ్య మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 30 గ్రామ పంచాయతీలలో 11 మంది డిఆర్‌పిలు సామాజిక తనిఖీలు నిర్వహించారన్నారు. రూ.11.38 కోట్ల పనులు చేపట్టారు. ఇందులో రికవరీ రూ.354893, పెనాల్టీ కింద రూ.69000 ఫీల్డ్ అసిస్టెంట్ల ద్వారా కట్టించాలన్నారు. ఈ కార్యక్రమంలో , ఎపిడి మాధవిలత, విడివిఒ లోకేశ్వర్, పర్సన్ చంద్రశేఖర్, ఎస్ఆర్‌పి నాగార్జున, ఎంపిడిఒ సుబ్బరాజు ఎపిఒ బజారు ఎనర్జీ సిబ్బంది పాల్గొన్నారు.

సామాజిక తనిఖీలు కక్ష సాధింపు: మండలంలో నిర్వహించిన సామాజిక తనిఖీలలో కక్ష సాధింపు జరిగిందని గుడి కంబళి ఫీల్డ్ అసిస్టెంట్ మారెప్ప ఆరోపించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ నాయకుల బెదిరింపులకు, అధికారుల వత్తిడికి తలవంచని పంచని ఫీల్డ్ అసిస్టెంట్లలపై రికవరి ఎక్కువగా చూపించడం తగదన్నారు. గుడి కంబాలి, గ్రామంలో మళ్లీ విచారణ నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై న్యాయ పోరాటం చేస్తామని ఆయన పేర్కొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుదాం

ప్రజాశక్తి-ఆదోని

పరిసరాలు పరిశుభ్రత తోనే రోగాలు దరి చేరవని ప్రతి ఒక్కరు స్వచ్ఛత సేవా కార్యక్రమాలు నిర్వహించుకోవాలని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గుడిష ఆదికృష్ణమ్మ తెలిపారు. గుడిసె ఆది కృష్ణమ్మ అక్క సేవా సైన్యం ఆధ్వర్యంలో మంగళవారం స్వచ్ఛ భారత్ కార్యక్రమం నాగనాతన హళ్లి లో నిర్వహించారు. గ్రామంలో బస్టాండు పరిసరాలు చీపురుతో శుభ్రం చేశారు. డ్రైనేజీ పేరుకు పోయిన చెత్తా చెదారం తొలగించి క్లీన్ చేశారు. ఈ సందర్భంగా గుడిసే ఆది క్రిష్ణమ్మ మాట్లాడారు. పల్లెలు అంటేనే స్వచ్ఛతకు మారుపేరు ఇలాంటి ప్రాంతాల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం మన అందరి బాధ్యతఅని తెలిపారు. డ్రైనేజీలు ఎప్పటికప్పుడు క్లీన్ చేస్తే దోమలువృద్ధి చెందవని రోగాలు దరి చేరవు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎక్స్ జడ్‌పిటిసి రామ్ భీం నాయుడు ఎక్స్ ఎంపిపి మురళి, ఎక్స్ ఎంపిటిసి తిమ్మారెడ్డి, నాగనాథన హళ్లి రవి మూకన్న, బైచిగేరి ఓంకార్, సాదిక్‌వలి మండిగిరి బాబురావు, కపటి మహాదేవ, శివ వర్మ, రాఘవరెడ్డి, మహాలింగ, బైచిగేరి అశోక్, ఖాసిం, రామంజి, మండిగిరి రవి, పరమేష్, రెడ్డి, కుప్పగల్లు హనుమంతు, ఆంజనేయులు, జిలాన్, చంద్ర, భరత్, వీరేష్ హరి పాల్గొన్నారు.

స్థానికులతో కలిసి పరిసరాలను శుభ్రం చేస్తున్న ఆది గుడిసె కృష్ణమ్మ

రావుస్ కళాశాల విద్యార్థుల క్షేత్రస్థాయి పర్యటన

- కంపెనీ విధి విధానాలు పై అవగాహన అవసరం

ప్రజాశక్తి -మ్మిగనూరు

పట్టణంలోని రావూస్ డిగ్రీ కళాశాలలో చదువుతున్న బికామ్ ఆనర్స్ ,బిబిఎ ఆనర్స్ ఫస్ట్ ఇయర్ ,సెకండ్ ఇయర్ మహిళా విద్యార్థులు కళాశాల వాణిజ్యశాస్త్ర శాఖ విభాగపు ఆధ్వర్యంలో క్షేత్ర పర్యటనలో భాగంగా మాధవరంలోని మారుతీ ఇస్పాట్ అండ్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ ప్లాంట్ లయోటి కంపెనీని మంగళవారం సందర్శించారు. ఈ కంపెనీలో పనిచేసే ఉన్నతాధికారులైన సేఫ్టీ డిపార్టుమెంట్ హెడ్ రాజు, సెక్యూరిటీ డిపార్టుమెంట్ హెడ్ మోహన్ రెడ్డి, అకౌంట్స్ డిపార్టుమెంట్ హెడ్ శంకర్ కంపెనీకి సంబంధించిన లక్ష్యాలు, పనితీరు గురించి విద్యార్థులకు సమాచారం ఇచ్చారు. వస్తువు తయారు చేయడంలో కావలసిన ముడిపదార్థం దాని ఆవశ్యకత, యంత్రాల పనితీరు వివరించారు. ఐరన్ ఉష్ణోగ్రత, తయారీ విధానం, కంపెనీలో జరిగే వివిధ వ్యాపార లావాదేవీలకు సంబంధించిన అకౌంట్స్ పద్ధతులు, కంపెనీలో విద్యుత్ శక్తి ఉపయోగ విధివిధానాలు తెలుసుకున్నారు. కంపెనీలో పని చేసే ఉద్యోగుల ప్రవర్తన వైఖరి, సమయపాలన జీతభత్యాలు,అలవెన్స్ మొదలైన అంశాలపట్ల మహిళా విద్యార్థులకు అవగాహన కల్పించారు. తర్వాత కళాశాల మహిళా విద్యార్థులు మాట్లాడుతూ క్షేత్రస్థాయి పర్యటన ద్వారా కంపెనీని దర్శించి కంపెనీకి సంబంధించిన లావాదేవీలు, యంత్రాల పనితీరు వివిధ అకౌంట్స్ పద్ధతులతో పాటు అనేక అంశాలు కంపెనీ ఉన్నతాధికారులు తెలిపారు. క్షేత్రస్థాయి పర్యటనకు ప్రోత్సహించిన కళాశాల యాజమాన్యానికి, అధ్యాపకులకు ధన్యవాదాలని సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ కంపెనీ క్షేత్రస్థాయి సందర్శనకు కళాశాల కామర్స్ విభాగాధిపతి విజయ్ కుమార్, కామర్స్ సీనియర్ లెక్చరర్ వీరేష్ లతోపాటు బికామ్, బిబిఎ మహిళా విద్యార్థులు పాల్గొన్నారు.

కంపెనీ ఉద్యోగులతో రావుస్ కళాశాల విద్యార్థినులు

డిఎస్‌పిని కలిసిన వినియోగదారుల సంఘం అధ్యక్షులు

ప్రజాశక్తి-ఆదోని

ఆదోని డిఎస్‌పి హేమలతను మంగళవారం కర్నూలు జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యులు , వినియోగదారుల సంఘం ఆదోని డివిజన్ అధ్యక్షులు బిఎం.ఈసాబాష తన బృందంతో పాటు మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్చెను అందజేశారు. ఈ సందర్భంగా ఆదోని ప్రాంతం వివరాలను డిఎస్‌పి అడిగి తెలుసుకున్నారు. ఆదోని డివిజన్ వినియోగదారులకు జరుగుతున్న అన్యాయంపై డిఎస్‌పికి ఈసా బాషా వివరించారు. ఆయనతోపాటు గౌసూల్ వరా, మజ్హర్ అహ్మద్ లు పాల్గొన్నారు.

వైసిపిని వీడే ప్రసక్తే లేదు

మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

ప్రజాశక్తి-మంత్రాలయం

వైసిపిని వీడే ప్రసక్తే లేదని మంత్రాలయం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఎమ్మెల్యే స్వగ్రామమైన రాంపురంలోని ఆయన స్వగృహంలో విలేకరులతో మాట్లాడారు. ఇటీవల వైసిపిని వీడుతున్నట్లు వచ్చిన ప్రచారాన్ని ఆయన ఖండించారు. కొన్ని వ్యక్తిగత కారణాలు సమస్యల వల్ల పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉన్నానే తప్ప ఇంకొకటి కాదన్నారు. ఎప్పటికీ వైసిపిలోనే ఉంటామని వైఎస్.జగన్మోహన్ రెడ్డి వెంటే నడుస్తానని స్పష్టం చేశారు. నాతో పాటు నా కుటుంబ సభ్యులు, మండల నాయకులు ఆధ్వర్యంలో కార్యక్రమాలు కొనసాగిస్తున్నామని చెప్పారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి ఆధ్వర్యంలో పార్టీ లోకి చేరిన నేను ఎప్పటికీ వైఎస్. కుటుంబం వెంటే ఉంటానన్నారు. వైసిపి పాలనలో మంత్రి పదవి వద్దనుకొని నియోజకవర్గ అభివృద్ధికి నిధులు తీసుకుని వచ్చానని చివరకు మంత్రి పదవి కూడా వదలకొని అభివృద్ధికి కృషి చేశానని మంత్రి పై ఎలాంటి అసంతృప్తి లేదని పేర్కొన్నారు. నియోజకవర్గంలో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

సొంత భూమి కలిగిన ప్రతి రైతుకు గుర్తింపు కార్డు

ప్రజాశక్తి-సి బెళగల్: సొంత భూమి కలిగిన ప్రతి రైతుకు విశిష్ట గుర్తింపు కార్డును ప్రభుత్వం మంజూరు చేస్తుందని ఎఒ మల్లేష్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం రైతు సేవా కేంద్రంలో రైతులతో సమీక్షించి మాట్లాడారు. పదకొండు నంబర్లతో కూడిన విశిష్ట గుర్తింపు కార్డు పొందాలంటే భూములను రిజిస్టర్ చేసుకోవాలని ఆ వెంటనే రెవిన్యూ అధికారులు సర్వే చేసి ఈ కార్డు జారీ చేస్తారని దీంతో ప్రభుత్వ వ్యవసాయ పథకాలకు అర్హులని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎఇఒ హిమబిందు, వ్యవసాయ సిబ్బంది అసిఫ్, ప్రవీణ్, వెంకటేశ్వర్లు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

చదువుతోనే దళితుల జీవితాల్లో వెలుగు : బిసిఆర్ దాస్

ప్రజాశక్తి-మద్దికేర

చదువు ద్వారానే దళితుల విద్యార్థుల జీవితాల్లో వెలుగులు వస్తాయని, ఎస్‌సి, ఎస్‌టి మానిటరింగ్ కమిటీ సభ్యులు బిసిఆర్ దాస్ అన్నారు. కీర్తి శేషులు బండారు తిమ్మయ్య సేవా సమితి ఆధ్వర్యంలో పారా రాఘవేంద్ర అధ్యక్షతన మండల కేంద్రమైన మద్దికేరలో పదవతరగతి చదువుతున్న దళిత విద్యార్థులకు చదువు ఆవశ్యకత పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పదవ తరగతి అనేది విద్యార్థి జీవితంలో కీలకమైన గట్టమన్నారు. పదవ తరగతి నుంచి విద్యార్థి లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకొని ముందుకు సాగలన్నారు. దళితులు ఆర్థికంగా వెనుకబాటు తనంతో ఉంటారని చెప్పారు. వెనుకబాటు తనం పారతోలాలంటే చదువు ద్వారా ఉన్నత స్థాయికి వెళ్ళగలగడమే మార్గమన్నారు. విద్యార్థులు ఇష్టపడి చదివితే సాధించలేనిదేది ఉండదన్నారు. వచ్చే యేడాది పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన దళిత విద్యార్థులకు నగదు ప్రోత్సాహ బహుమతులు అందిస్తామన్నారు. ఎపి ఎంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు పరా రాఘవేంద్ర, సర్పంచి బండారు సుహాసిని, తహశీల్దార్ హుస్సేన్ సాహెబ్, ఎంపిడిఒ కొండయ్య, ఎస్ఐ విజయ్‌కుమార్ నాయక్, అడ్వకేట్ రామాంజనేయులు బండారు ఆంజనేయులు విద్యార్థులు పాల్గొన్నారు.

ఘంటసాలకు పలువురి నివాళి

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

పద్మశ్రీ ఘంటసాల 51వ వర్ధంతి సందర్భంగా ఆయకర్ భవన్ ఎదురుగా ఉన్న ఘంటసాల విగ్రహం వద్ద పలువురు ఘనంగా నివాళులు అర్పించారు. ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ శంకరశర్మ, డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ సీతారాం, లలిత కళా సమితి అధ్యక్షులు పత్తి ఓబులయ్య ,డిప్యూటీ కలెక్టర్ కొండయ్య తదితరులు మంగళవారం ఘనంగా నివాళులు అర్పించిన వారిలో ఉన్నారు. వారు మాట్లాడుతూ ఘంటసాలను చిరంజీవి ఎందుకంటున్నానంటే అశ్వత్థాముడు, బలీ, వ్యాసుడు, హనుమంతుడు, విభీషణుడు, కచుడు, పరశురాముడు, ఏడు మంది చిరంజీవులు అంటే ఈ ప్రపంచం ఉన్నంతవరకు కలికాలం ఉన్నంతవరకు వాళ్ళు ఉంటారని అర్థం అన్నారు. మన మాస్టారు భౌతికంగా లేకపోవచ్చు ఆయన నిజంగా చిరంజీవి ఎందుకన్నానంటే అందరి హృదయాల్లో ప్రపంచం ఉన్నంతవరకు తెలుగు వారు ఉన్నంతవరకు ఆయన బతికే ఉంటారన్నారు. ప్రతి ఒక్కరి గళంలో, హృదయాల్లో ఆయన చిరంజీవిగా ఉంటారన్నారు. అందుకే ఆయన చిరంజీవి అన్నామని తెలిపారు. ఘంటసాల మాస్టర్ భగవద్గీత అది వింటే మనస్సుకు ఎంతో ఆహ్లాదంగా ఉంటుందన్నారు. మనశ్శాంతి కలుగుతుందన్నారు. అన్ని రకాలుగా మనిషికి ఆరోగ్యంగానే కాక మానసిక ధైర్యం కూడా ఇస్తుందన్నారు. ఘంటసాల అభిమానులు అందరికీ మనసారా నా హృదయపూర్వక అభినందనలు ,ధన్యవాదాలు తెలుపుకుంటున్నామని అన్నారు. పద్మశ్రీ ఘంటసాల గాన కళా సమితి అధ్యక్షులు సుస్వరం వాసుదేవ మూర్తి కర్నూలు లలితకళా సమితి అధ్యక్షులు పత్తి ఓబులయ్య ఆధ్వర్యంలో టిజివి కళాక్షేత్రంలో, ఘంటసాల వర్ధంతి కార్యక్రమాల సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు ,ఘంటసాల పాటల విభావరి నిర్వహించారు.

అయాకర్ భవన్ ఘంటసాల విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న డాక్టర్ శంకర్‌శర్మ, చంద్రశేఖర్ తదితరులు

విద్యారంగ సమస్యలపై పోరాటం : ఎస్ఎఫ్ఐ

పజాశక్తి-పత్తికొండ : పత్తికొండలో నెలకొన్న విద్యారంగ సమస్యలపై పోరాటాలకు సిద్ధం కావాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రంగప్ప పేర్కొన్నారు. మంగళవారం పత్తికొండ పట్టణంలోని బాలుర వసతి -1 భవనంలో వివేక్ అధ్యక్షతన మండల మహాసభకు ఎస్ఎఫ్ఐ మాజీ నాయకులు చక్రాల వెంకటేశ్వర్ రెడ్డి, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రంగప్ప మాట్లాడారు. నియోజకవర్గ కేంద్రమైన పత్తికొండలో విద్యార్థులు అనేక సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పిజి, ఐటిఐ, పాలిటెక్నిక్ కళాశాలలో లేకపోవడంతో వేలమంది విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బాలికల వసతిగృహంలో మౌలిక సదుపాయాలు లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తల్లికి వందనం, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో విద్యార్థి సంఘాలను కలుపుకొని పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

ఎస్ఎఫ్ఐ నూతన కమిటీ ఎన్నిక

పత్తికొండ మండల కార్యదర్శి రంజిత్ రెడ్డి, మండల అధ్యక్షులు వివేక్ , మండల ఉపాధ్యక్షులుగా రాహుల్ మండల సహాయ కార్యదర్శిగా రాకేష్ , బాలికల కమిటీ సహాయ కార్యదర్శిగా రక్షిత ఉపాధ్యక్షురాలుగా కౌసల్య, హిమాంబితో పాటు 25 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు.

కో-ఆపరేటివ్ టౌన్ బ్యాంక్ వైస్ చైర్మన్ నరసప్పకు సన్మానం

ప్రజాశక్తి-నందవరం

నందవరం మండలం హాలహర్వి గ్రామానికి చెందిన టిడిపి నాయకులు జి.మణికుమార్, ఎం.కిష్టప్ప, ఎం.ఆనంద్, ఎం.ఎర్రన్న, జి ఏసేపు, జి ప్రభాకర్, జి.ఇమ్మానుయేలు, ఎం.జయన్న కో-ఆపరేటివ్ టౌన్ బ్యాంక్ వైస్ చైర్మన్ బండానరసప్పను శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పార్టీ కోసం పని చేసినందుకు గుర్తించి కో-ఆపరేటివ్ టౌన్ బ్యాంక్ వైస్ చైర్మన్‌గా ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి పదవి ఇవ్వడం ఆనందదాయకంగా ఉందన్నారు. పార్టీ బలోపేతానికి కృషి చేసిన ఎంతో మందికి బిసి కుటుంబం పదవులు ఇచ్చి గౌరవించిందని కొనియాడారు. పార్టీ కోసం బాధ్యతగా పనిచేసి పార్టీ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. నాయకులు, కార్యకర్తలు నన్ను సన్మానించినందుకు చాలా సంతోషంగా ఉందన్నారు.



శ్మశాన వాటిక స్థలాన్ని పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్, డిఎస్‌పి

64 మంది పై బైండోవర్ కేసులు

ఎస్ఐ శివాంజల్

ప్రజాశక్తి మంత్రాలయం

మంత్రాలయం మండలం చెట్నిహల్లి గ్రామంలో నెలకొన్న శ్మశాన వాటిక సమస్యపై ముందు జాగ్రత్త చర్యగా ఇరువర్గాల పై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ శివాంజల్ తెలిపారు. ఫిబ్రవరి 2న శ్మశాన వాటిక విషయంలో బిసి సామాజికతరగతికి, ఎస్‌సి సామాజిక తరగతికి మధ్య వివాదం చెలరేగి జిల్లా, డివిజన్ స్థాయిలో ఇరువర్గాల వారు పోటాపోటీగా ఫిర్యాదు చేసుకోవడంతో మంగళవారం సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్ డిఎస్‌పి ఉపేంద్రబాబు తహసీల్దార్ ఎస్‌రవి, సిఐ రామాంజులు, కోసిగి సిఐ మంజునాథ్‌ల ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది బందోబస్తు మధ్య గ్రామ పరిసరాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా శ్మశాన వాటిక పై తీసుకునే నిర్ణయం పై ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డిఎస్‌పి ఉపేంద్రబాబు, సిఐ రామాంజులు, ఆదేశాల మేరకు శాంతి భద్రతల పరిరక్షణకు ఇరువర్గాల నుంచి 32, 32 మందిపై మొత్తం 64 మంది పై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

భూ సర్వేలను క్షేత్రస్థాయిలో చేపట్టాలి

ప్రజాశక్తి-సి బెళగల్

సి బెళగల్ మండలంలో చేపట్టిన భూ సర్వేలను క్షేత్ర స్థాయిలో చేపట్టాలని తహసీల్దార్ పురుషోత్తం సంబంధించిన అధికారులకు సూచించారు. మంగళవారం మండల సర్వేయర్ నాగభూషణం అధ్యక్షతన విఆర్‌ఒలు, గ్రామ సర్వేయర్లతో సమీక్షించి తహసీల్దార్ మాట్లాడారు. భూ సర్వేలు చేసేటప్పుడు రైతులకు ముందుగా సమాచారం ఇవ్వాలని ఆ వెంటనే ఆ భూమిలో సంబంధించిన రైతులతో ఛాయా చిత్రాలను భద్రపరచుకోవాలని పేర్కొన్నారు. అలాగే ప్రతి రైతు భూ సర్వేలకు సహకరించేలా అవగాహన కల్పించాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో యువకునికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-చిప్పగిరి

చిప్పగిరి మండల కేంద్రం ఆలూరు గుంతకల్ రోడ్డులో ఉన్న పెట్రోల్ బంక్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకునికి గాయాలయ్యాయి. తెలిసిన వివరాల మేరకు బెల్డోన గ్రామానికి చెందిన రమేష్ (31) గుంతకల్ నుండి బెల్డోనకు వెళ్తున్న సమయంలో పెట్రోల్ బంక్ సమీపంలో గొర్రెలు అడ్డు రావడంతో ద్విచక్ర వాహనం అదుపు తప్పి కింద పడడంతో యువకునికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో ఒక గొర్రెమృతి చెందింది. ప్రమాదాన్ని గమనించిన వారు 108కి కాల్ చేయడంతో గుంతకల్ ప్రభుత్వ ఆసుపత్రికి గాయపడిన యువకుడ్ని తరలించారు.